



శాసనసభలో వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం

వ్యవసాయానికి రూ.45,661 కోట్లు

1000 ప్రాంతాల్లో సీఎం రైతు సంక్షేమ సేవా కేంద్రాలు

ఈ-రెంటల్ యాప్‌తో అద్దెకు వ్యవసాయ పరికరాలు ● ఏటా ముగ్గురికి నమ్మాళ్వార్ అవార్డులు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.45,661 కోట్లు కేటాయిస్తూ వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్‌సెల్వం శనివారం ఉదయం శాసనసభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశపెట్టారు. గత యేడాది కంటే రూ.3,380కోట్లు అధికంగా కేటాయించినట్లు ఆయన ప్రకటించారు. పంటల సాగుబడి పెంచడం, బీడు భూములను సాగుకు అనుగుణంగా మార్చడం, ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేందుకు ధరల నిర్ణయ కేంద్రాలను ఏర్పాటు చేయడం. రైతులకు సాగు పద్ధతులపై అన్ని రకాల సలహాలు ఇచ్చేందుకు 1000 చోట్ల సీఎం రైతు సంక్షేమ సేవాకేంద్రాల ఏర్పాటు, ఈ- రెంటల్ యాప్‌తో వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇవ్వడం, సేంద్రియ వ్యవసాయంలో అధికోత్పత్తిని సాధించే ముగ్గురు రైతులకు 'నమ్మాళ్వార్' పేరుతో అవార్డుల ప్రదానం వంటి ఆకర్షణీయమైన అంశాలతో ప్రతిపాదనలను ఆయన బడ్జెట్‌లో పొందుపరిచారు. ఉదయం 9.31 గంటలకు ప్రారంభమైన బడ్జెట్ ప్రసంగం 11.13 గంటలకు పూర్తయింది. మొత్తం 64 పేజీల వ్యవసాయ బడ్జెట్‌ను గంటా 42 నిమిషాల్లో పూర్తి చేశారు.

రూ.510 కోట్లతో వ్యవసాయ యంత్రాలు...

రాష్ట్రంలో పంటల దిగుబడిని పెంచే దిశగా 57 వేల మంది రైతులకు వ్యవసాయ యంత్రాలను పంపిణీ చేయనున్నారు. ఈ పథకానికి రూ.510 కోట్లు ఖర్చు చేయనున్నామని మంత్రి చెప్పారు. కలైంజర్ సమగ్ర వ్యవసాయాభివృద్ధి పథకానికి రూ269.50 కోట్లు, 500 ఎకరాల్లో గులాబీ సాగుకు 8.51 కోట్లు, కొబ్బరి పంటల విస్తరణకు రూ.35.26 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

ఎంఎస్ స్వామినాథన్ పేరుతో కొత్త అన్వేషణలు...

ఈ బడ్జెట్‌లో హరితవిప్లవం ఆద్యుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ పేరుతో వ్యవసాయ రంగంలో నూతన అన్వేషణలను ప్రోత్సహించే పథకానికి రూ.కోటి కేటాయించినట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. ఇదే విధంగా సేంద్రియ వ్యవసాయంలో అధికోత్పతిని సాధించే ముగ్గురు రైతులకు నమ్మాళ్వార్ అవార్డులు ప్రదానం చేస్తామని, సేంద్రియం చేసే రైతులకు నగదు సాయం అందిస్తామన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎకరాల్లో బిందు సేద్యానికి రూ.1168 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

ఐదు ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు...

రాష్ట్రంలో కడలూరు జిల్లా నల్లూరులో పండించే జొన్నలు, దిండుగల్ జిల్లా నత్తంలో పండించే చింతపండు, కారైక్కుడి జామ, కప్పల్‌కట్టిలో పండించే మునక్కాయలు, నాగపట్టినం జిల్లా వేదారణ్యంలో పండించే జాజి పూలకు భౌగోళిక గుర్తింపు పొందడానికి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఈ భౌగోళిక గుర్తింపు సాధన కోసం రూ.15 లక్షలు కేటాయించినట్లు చెప్పారు. ఇక సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు చెన్నై, కోయంబత్తూరు, తూత్తుకుడి, మదురైలో ధరల నిర్ణయ కేంద్రాల ఏర్పాటు చేస్తామన్నారు.

బడ్జెట్‌లో విశేషాలు..

- కావేరి, పెన్నైయారు, వెల్లారు పరివాహక ప్రాంతాల్లో, కల్లనై కాలువ సాగు ప్రాంతాల్లోని సీ, డీ కేటగిరి పంట కాల్వల మరమ్మతు పూడిక తీతకు రూ.13.80 కోట్లు
- తెన్‌కాశి, దిండుగల్, తేని, కళ్ళకురిచ్చి, నీలగిరి, సేలం జిల్లాలో 500 ఎకరాల విస్తీర్ణంలో అరటి సాగుకు రూ.69 కోట్లు
- పనస పంట సాగును పెంచేందుకు రూ.5 కోట్ల కేటాయింపు, పనస, అంతర పంటల సాగుపై శిక్షణ కార్యక్రమాలు
- తాటి చెట్ల సంఖ్యను పెంచి, తాటి సంబంధిత పరిశ్రమల ప్రోత్సాహానికి రూ.1.65 కోట్లు
- రూ.10 కోట్లతో జీడిపప్పు బోర్డు ఏర్పాటు
- వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించేందుకు రామనాథ పురం, తూత్తుకుడి, విరుదునగర్, శివగంగ జిల్లాలో 2500 ఎకరాల్లో మిర్చి సాగుకు రూ.11.74 కోట్లు
- వంట నూనెల ఉత్పత్తి స్వయం సమృద్ధిని సాధించేందుకు రూ.108.6 కోట్లతో నూనెవిత్తుల సంస్థ
- రూ.40.27 కోట్లతో మొక్కజొన్న ఉత్పత్తి అభివృద్ధి పథకం
- చెరకు రైతులకు ప్రత్యేక ప్రోత్సాహక నగదు పంపిణీకి రూ.297 కోట్లు
- పంటల బీమాకు రూ.841 కోట్లు
- వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల ద్వారా శుద్ధీకరించిన 3000 మెట్రిక్ టన్నుల విత్తనాల కొనుగోలు
- రూ.42 కోట్లతో 1000 రైతు సంక్షేమ సేవా కేంద్రాలు
- రాష్ట్రాన్ని హరితవనంగా మార్చేందుకు అగ్రో ఫారెస్ట్రీ పాలసీ
- భూములు లేని రైతు కూలీలు ప్రమాదం వల్ల మృతి చెందితే అంత్యక్రియలకు చెల్లించే నగదు సాయం పెంపు
- రాష్ట్రంలో 16.3 లక్షల హెక్టార్లలో ఉద్యానవన పంటల సాగు
- పూలసాగు రైతులకు సబ్సిడీ చెల్లించడానికి రూ.8.51 కోట్లు



బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు సీఎం స్టాలిన్ ఆశీస్సులందుకుంటున్న మంత్రి పన్నీర్‌సెల్వం

ఈ-రెంటల్ యాప్‌తో అద్దెకు పరికరాలు

రైతులకు వ్యవసాయ పనిముట్లు సులువుగా లభించడానికి ఈ-రెంటల్ యాప్‌ను రూపొందించనున్నామని, దాని ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లను అద్దెకు ఇవ్వనున్నామని తెలిపారు. ఈ పథకం అమలు కోసం బడ్జెట్‌లో రూ.17.37 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇదే విధంగా చిన్న, సన్నకారు రైతులకు రూ.10.50 కోట్లతో 130 వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా 17 వేలమంది రైతులకు వ్యవసాయ పరికరాలు, పనిముట్లను రాయితీపై అందించనున్నామని, దీనికి కోసం రూ.215 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

సీఎం సోలార్ పంపుసెట్లు

రాష్ట్రంలో విద్యుత్ కనెక్షన్లు లేని, వర్షాధార భూముల్లో పంటలు పండించే 1000 మంది రైతులకు 'సీఎం సోలార్ పంపుసెట్ల'ను పంపిణీ చేస్తామని, ఈ పథకానికి రూ.24 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. వేసవిలో దిగుబడి తగ్గడం కారణంగా కూరగాయల ధరల పెంపును నియంత్రించడానికి ప్రధానమైన కాయగూరలను ఏప్రిల్, మే నెలల్లో సాగుచేయడానికి రూ.10.50 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

రూ.52.44 కోట్లతో రాష్ట్ర చిరుధాన్యాల సంస్థ...

వరి, మొక్కజొన్న, రాగులు, సజ్జ తదితర పంటలతో పాటు పప్పుదినుసులను ప్రోత్సహించడానికిగాను రాష్ట్రంలో చిరుధాన్యాల సంస్థను ఎర్పాటు చేస్తామని, దీని కోసం రూ.52.44 కోట్లు కేటాయించామన్నారు. వర్షాధార భూముల్లో 3 లక్షల హెక్టార్లలో వేసవిలో సాగు చేయడానికి హెక్టారుకు రూ.2000 సబ్సిడీ అందిస్తామన్నారు.

రూ.18 కోట్లతో ఉల్లిపాయల గోదాములు...

రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల నుంచి ఉల్లిపాయలు దిగుమతి తగ్గినప్పుడల్లా వాటి ధరలు ఆకాశాన్నంటడం ఆనవాయితీగా మారిందని, ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఉల్లిపాయల ధరలను స్థిరంగా ఉండేలా ఉల్లిపాయలను నెలల తరబడి నిల్వ చేయడానికి అనువుగా రూ.18 కోట్లతో ప్రత్యేక గోదాములు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

విదేశీ పర్యటనకు 100 మంది రైతులు...

విదేశాల్లో పంటల సాగు విధానాలను అధ్యయనం చేయడానికి రాష్ట్రం నుంచి 100 మంది ఆదర్శ రైతులను ఎంపిక చేయనున్నట్లు మంత్రి పన్నీర్‌సెల్వం తెలిపారు. ఆ మేరకు ఆ రైతులంతా జపాన్, చైనా, వియత్నాంలకు వెళ్లి అక్కడి పంటల సాగు పద్ధతులు, దిగుబడులు తదితరం అంశాలపై అధ్యయనం చేసి వస్తారని చెప్పారు.

రైతులకు నిరాశే

● ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి




మీడియాతో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం శనివారం దాఖలు చేసిన వ్యవసాయ బడ్జెట్ రైతులను నిరాశ పరిచిందని ప్రతిపక్ష నేత, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) వ్యాఖ్యానించారు. రాష్ట్ర అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్కే పన్నీర్ సెల్వం శనివారం ఉదయం దాఖలు చేసిన వ్యవసాయ బడ్జెట్‌పై ఎడప్పాడి విమర్శలు గుప్పించారు. మంత్రి పన్నీర్ సెల్వం అసెంబ్లీలో 1.42 గంటలు బడ్జెట్ చదవడమే డీఎంకే ప్రభుత్వం సాధించిన విజయమన్నారు. ఇందులో ఆర్థికంగా రైతులు అభివృద్ధి చెందే పథకం ఏదీ లేదని దుయ్యబట్టారు. గత నాలుగేళ్లుగా దాఖలు చేస్తున్న ఆర్థిక బడ్జెట్‌తో పాటు రైతుల సంక్షేమార్థం ప్రత్యేక బడ్జెట్‌ను ప్రభుత్వం దాఖలు చేస్తోందని, ఇందువల్ల రైతులకు ఒరిగిందేమీలేదన్నారు. వ్యయ ప్రయాసలతో నెలల తరబడి చెమటోడ్చి పండించిన పంటలతో ప్రజల ఆకలి తీరుస్తున్న రైతులను మోసగించడంలో డీఎంకే నేతలు సిద్ధహస్తులని ఎద్దేవా చేశారు. వాస్తవం చెప్పాలంటే వ్యవసాయ బడ్జెట్ ఉడికించిన కూరగాయల్లాంటిదన్నారు. పశుసంవర్థక, వ్యవసాయ, జలవనరులు, మత్స్య అభివృద్ధి, పాడి పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో ఉన్న కొన్ని పథకాలను జతచేసి పుస్తకంగా ముద్రించిందే డీఎంకే వ్యవసాయ బడ్జెట్ అని ఈపీఎస్ విమర్శించారు. రాష్ట్రంపై పెరుగుతున్న అప్పుల భారం గురించి పట్టించుకోని డీఎంకే ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వరి, చెరకు ఉత్పత్తి పడిపోయిందన్నారు. సాగు విస్తీర్ణాన్ని 75శాతంగా విస్తరిస్తామన్న ఎన్నికల హామీలో ఇప్పటివరకు 37.7శాతం మాత్రమే వృద్ధి సాధించారన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వ హయాంలో అమలుచేసిన పథకాల వల్లే రైతులు అన్ని విధాలా లబ్ధిపొందారన్నారు. అత్తికడవు-అవినాశి సంయుక్త తాగునీటి పథకాన్ని అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రారంభించిందన్న ఈర్ష్యతోనే దాన్ని అటకెక్కించిందని చెప్పారు. అదేవిధంగా వాననీటిని సేకరించే పథకాన్ని కూడా డీఎంకే ప్రభుత్వం నీరుగార్చిందన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి 24గంటలు విద్యుత్ సరఫరా జరిగిందని, అయితే ఈ డీఎంకే మోడల్ ప్రభుత్వంలో వ్యవసాయ పంపు సెట్ల మోటర్లకు డెల్టా జిల్లాలు మినహాయించి ఇతర జిల్లాల్లో షిఫ్ట్ విధానంలో విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని విమర్శించారు.

డీఎంకే ఎంపీల్లో ఐక్యతా లోపం..

డీఎంకే కూటమిలో 39మంది ఎంపీలున్నారని, అయితే వీరిలో ఐక్యత లేనందువల్లే రాష్ట్రానికి రావల్సిన నిధులు సక్రమంగా రావడం లేదన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యలను పార్లమెంట్ ఉభయసభల్లో ప్రస్తావించడంలేదన్నారు. ఇండియా కూటమిలో ఉన్న పార్టీల నేతలను రాష్ట్రమంత్రులు పలుమార్లు ఢిల్లీకి వెళ్ళి సంప్రదిస్తున్నారని, అయితే నదీజలాల పంపిణీ సమస్యను పరిష్కరింపజేయలేక చతికలబడ్డారని దుయ్యబట్టారు. 13ఏళ్ళు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు విద్యను రాష్ట్ర సిలబస్‌లో చేర్చకుండా రాజకీయం చేశాయన్నారు. శుక్రవారం దాఖలు చేసిన ఆర్థిక బడ్జెట్‌లో లాగే వ్యవసాయ బడ్జెట్‌లో కేవలం ఖాళీ ప్రకటనలు ఉన్నాయని, ఎన్నికల హామీలు నెరవేర్చని డీఎంకే ప్రభుత్వం తమ జన రంజక బడ్జెట్ అని ప్రజలను మభ్యపెడుతోందని ఈపీఎస్ వ్యాఖ్యానించారు.

31న కన్నియాకుమారికి అమిత్ షా



కేంద్రమంత్రి అమిత్ షా

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈనెల 31న కన్నియాకుమారి రానున్నారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా విభాగం (సీఐఎస్ఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రాణిపేట జిల్లా తక్కోలంలో ఉన్న రాజా ఆదిత్య చోళన్ ఆర్టీసీ సెంటర్ నుంచి చేపట్టిన సైకిల్ ర్యాలీని ఈ నెల 7వ తేది కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జెండా ఊపి ప్రారంభించిన విషయం తెలిసిందే. 'సురక్షిత్ తట్ సమృద్ భారత్' (సురక్షితమైన సముద్ర-సంపన్న భారత్) అనే శీర్షికతో ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ఒక క్రీడగా మాత్రమే కాకుండా దేశభక్తిని చాటిచెప్పేలా రూపొందించారు. దేశంలోని సముద్రతీరాల్లో స్మగ్లింగ్, మాదకద్రవ్యాల తరలింపు, ఆయుధాలు, పేలుడు పదార్థాల రవాణా వంటివి ప్రజల చెంతకు తీసుకెళ్లాలనేది ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం. నార్త్, సౌత్ అని రెండు జోన్లుగా విభజించి ఈ సైకిల్ ర్యాలీ చేపట్టారు. 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి మొత్తం 6,553 కి.మీ దూరం ప్రయాణించి ఈనెల 31న కన్నియాకుమారి వివేకానంద స్మారక కేంద్రం వద్దకు చేరుకొని ర్యాలీ ముగించనున్నారు. ర్యాలీ ముగింపు వేడుకల్లో అమిత్ షా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి ఈ నెల 31న కన్నియాకుమారి రానున్నారు. ఈ నేపథ్యంలో, ర్యాలీ ముగింపు కార్యక్రమం నిర్వహించే వివేకాంద స్మారక కేంద్రాన్ని సీఐఎస్ఎఫ్ దక్షిణ మండల ఐజీ శరశణన్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన వెంట కూడన్‌కుళం అణువిద్యుత్ కేంద్రం సీఐఎస్ఎఫ్ కమాండర్ మంగాచౌదరి, అసిస్టెంట్ కమాండర్ అసీం భరద్వాజ్, ఇన్‌స్పెక్టర్ మణికంఠన్ తదితరులున్నారు.




వివేకానంద స్మారక కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు

తిరువారూరు త్యాగరాజస్వామి ఆలయంలో పంగుని ఉత్సవాల ప్రారంభం



ధ్వజస్తంభ పూజల్లో పాల్గొన్న అశేష భక్తజనం



ధ్వజారోహణం

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తిరువారూరు త్యాగరాజస్వామి ఆలయం పంగుని ఉత్సవాలకు ప్రత్యేక అంశాలతో ముస్తాబైంది. తమిళ మాసం పంగుని శనివారం ప్రారంభమైన సందర్భంగా, సంగీత ముమ్మూర్తులలో ఒకరైన త్యాగరాజస్వామి ఆలయంలో ధ్వజారోహణ పూజలతో పంగుని ఉత్సవాలు కోలాహలంగా ప్రారంభం కాగా, ఈ ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో పోటెత్తారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ఆళి రథోత్సవం వచ్చే ఏప్రిల్ 7న నిర్వహించేందుకు ఆలయ పాలకమండలి సభ్యులు సన్నాహాలు చేపడుతున్నారు. 350 టన్నుల బరువు, 90 అడుగుల ఎత్తుతో కలపతో అందంగా రూపొందించిన త్యాగరాజస్వామి ఆలయ రథోత్సవం ఆసియా ఖండం లోనే అతిపెద్దది కావడం విశేషం. 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయానికి సుమారు 900ఏళ్ల ఘన చరిత్రవుంది. ఈ ఏడాది పంగుని ఉత్తర మహోత్సవాల స్తంభస్థాపన కార్యక్రమాన్ని గత నెల 11న శివాచార్యులు ఆలయ సంప్రదాయాలతో ప్రారంభించారు. ఆ తర్వాత శనివారం ఉదయం 8.30 గంటలకు విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు, చండీకేశ్వర, చంద్రశేఖరస్వామి ఉత్సవమూర్తులను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. వేలసంఖ్యలో ఇక్కడికి తరలివచ్చిన భక్తుల దివ్యనామస్మరణ, మేళతాళాల మధ్య శివాచార్యులు త్యాగరాజస్వామి సన్నిధిలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ స్తంభంపై పతాకాన్ని ఆవిష్కరించి ఉత్సవాలు ప్రారంభించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆదివారం) : 6.27

సహర్ (సోమవారం) : 4.35

సమాచార దర్శిని

నేడు అమరజీవి 124వ జయంతి

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి జరగనుంది. మైలాపూర్, లజ్‌లో ఉన్న అమరజీవి స్మారక భవనంలో ఉదయం 10 గంటలకు నిడమర్తి వసుంధరా దేవి ప్రార్థన గీతంతో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్షుడు అనిల్ కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించనుండగా, ఆంధ్రప్రదేశ్ మ్యారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. కమిటీ కార్యదర్శి వి.కృష్ణారావు కార్యక్రమానికి స్వాగతం పలకనుండగా, కమిటీ సభ్యుడు, ప్రముఖ సినీ రచయిత భువన చంద్ర గురువులకు అభినందనలు తెలపనున్నారు. కమిటీ సంయుక్త కార్యదర్శి పూరా శశికళ సభా నిర్వహణ చేపట్టనుండగా, డాక్టర్ ఎంవీ నారాయణగుప్తా వందన సమర్పణతో కార్యక్రమం ముగియనుంది. ఈ సందర్భంగా తెలుగుభాష కోసం విశేష కృషి చేసిన 31 మంది ఆచార్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని అనిల్‌కుమార్‌రెడ్డి, కృష్ణారావు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

'ఇన్నోవేటివ్' ఇంజనీరింగ్ శిక్షణ

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ యూజీ కోర్సులు పూర్తిచేసిన వారికి థాడ్కో ఆధ్వర్యంలో 'ఇన్నోవేటివ్' ఇంజనీరింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు 21-25 ఏళ్లలోపున్న ఆదిద్రావిడులు, గిరిజన వర్గాలకు చెందిన అభ్యర్థులు www.tahdco.com లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఎంపిక చేసిన అభ్యర్థులకు తిరుచ్చి, తిరునల్వేలి, సేలం తదితర ప్రాంతాల్లో 18 వారాల శిక్షణ ఇవ్వనున్నట్లు థాడ్కో డైరెక్టర్ కందస్వామి తెలిపారు.

వైద్యులు, నర్సుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో పని చేసేందుకు వైద్యులు, నర్సుల పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 208 అర్బన్ హెల్త్ సెంటర్లున్నాయి. ఈ కేంద్రాల్లో పని చేసేందుకు వైద్యులు, నర్సులు అని తలా 208, వైద్య సిబ్బంది అని మొత్తం 832 పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. వైద్యులకు నెలకు రూ.60,000, నర్సులకు రూ.18,000, గ్రేడ్-1 వైద్య సిబ్బంది పోస్టులకు రూ.14,000, అసిస్టెంట్లకు రూ.8,500 వేతనం అందజేయనున్నారు. ఈనెల 24వ తేదిలోపు ఆయా జిల్లాల ఆరోగ్యశాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలి. ఈ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ఏప్రిల్ 1వ తేది నిర్వహించి 2వ తేది ఫలితాలు వెల్లడిస్తారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

'కుకింగ్ అసిస్టెంట్' పోస్టుల భర్తీకి ఉత్తర్వులు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో కుకింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ పోస్టుకు నెలకు రూ.3,000 అందజేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం, 8,997 కుకింగ్ అసిస్టెంట్ పోస్టుల భర్తీ చేపట్టనున్నట్లు జీవోలో తెలిపింది.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాల విడుదల

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. మెయిన్స్ పరీక్షలు రాసిన 1,888 మందిలో 190 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల పరిశీలన ఏప్రిల్ 7వ తేది నుంచి ప్రారంభమవుతుందని టీఎన్‌పీఎస్సీ ప్రకటనలో తెలియజేసింది.

ప్రైమరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రైమరీ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ పరీక్షకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల డైరెక్టరేట్ పేర్కొంది. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నిర్వహించనున్న ఈ పరీక్షలకు www.dge.tn.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని, పూర్తిచేసి, తగిన సర్టిఫికెట్ల నకళ్లతో ఈనెల 18 నుంచి 24వ తేది వరకు జిల్లా ఉపాధ్యాయ విద్య శిక్షణా కేంద్రాల్లో సమర్పించాలి. దరఖాస్తు సమర్పించే సమయంలో పరీక్షా ఫీజు చెల్లించాలి. తత్కాల్ పథకంలో రూ.1,000 ప్రత్యేక రుసుముతో ఈనెల 25, 26తేదీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐపీఎల్ మ్యాచ్‌లకు ఎంటీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 18వ సీజన్ ఈనెల 22వ తేది నుంచి ప్రారంభం కానుంది. చిదంబరం స్టేడియంలో ఈ నెల 23, 28, ఏప్రిల్ 5, 11, 25, 30, మే 12 తేదీల్లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లకు టిక్కెట్లు కొనుగోలు చేసే అభిమానులు ఎంటీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం కల్పించారు. మ్యాచ్‌కు మూడు గంటల నుంచి స్టేడియంకు వచ్చే బస్సుల్లో కండక్టర్లకు టిక్కెట్లు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చని అధికారులు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లపై నిఘా వేసేలా వారికి గుర్తింపు కార్డులను పోలీసు శాఖ అందించనుంది. ఈ విషయమై పోలీసు శాఖ ఉన్నతాధికారి మాట్లాడుతూ... 2012లో చెన్నై సెంట్రల్‌లో రైల్వే పోలీసుల ద్వారా ఆటో డ్రైవర్లకు గుర్తింపుకార్డులు అందజేశామన్నారు. ప్రస్తుతం ఈ విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని నిర్ణయించామన్నారు. గుర్తింపు కార్డుల్లో ఫొటో, పేరు, చిరునామా, మొబైల్ నెంబరు తదితరాలు ఉంటాయన్నారు. నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.

రేపు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పంగుణి మాసంలో శుభముహూర్తం రోజైన సోమవారం (ఈ నెల 17వ తేది) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందజేయనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది. ఒక రిజిస్ట్రార్ పనిచేసే కార్యాలయాల్లో అందించే 100 టోకెన్లకు బదులుగా 150, ఇద్దరు రిజిస్ట్రార్లు పనిచేసే కార్యాలయాల్లో 200లకు బదులుగా 300 టోకెన్లు ఇవ్వనున్నారు. అలాగే, తత్కాల్ రిజిస్ట్రేషన్లలో నాలుగు టోకెన్లు అదనంగా అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

అలకపాన్పు వీడని సెంగోటయ్యన్!

● రెండు రోజులు ఈపీఎస్‌కు దూరం



చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్), ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి సెంగోటయ్యన్ మధ్య దూరం రోజురోజుకు పెరుగుతోంది. కొద్ది రోజులుగా వీరిద్దరు ఎడమొహం పెడమొహంగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరి మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతోందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కోయంబత్తూరులో మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి ఇంట వివాహ వేడుకల్లో వీరిద్దరినీ సన్నిహితంగా కలుసుకునేందుకు అవకాశం కల్పించినా... సెంగోటయ్యన్ ఉద్దేశపూర్వంగా ఈపీఎస్ ఆ వేడుకలకు వస్తున్నారనే కారణంగానే ఆయనను కలుసుకోలేదని తెలుస్తోంది. ఇక ఇటీవల ఈపీఎస్ అధ్యక్షతన జరిగిన అన్నాడీఎంకే శాసనసభ్యుల సమావేశానికి కూడా సెంగోటయ్యన్ గైర్హాజరయ్యారు. శుక్రవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సెంగోటయ్యన్ అన్నాడీఎంకే సభ్యులతోపాటు ప్రతిపక్ష సభ్యుల ప్రవేశ ద్వారం గుండా వెళ్లకుండా స్పీకర్ వెళ్లే మార్గంలో వెళ్లారు. ఇక శనివారం ఉదయం శాసనసభ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన సెంగోటయ్యన్ అసెంబ్లీ సమావేశం ప్రారంభం కావడానికి ముందు స్పీకర్ అప్పావును ఆయన ఛాంబర్‌లో కలుసుకుని పావు గంట సేపు సమావేశమయ్యారు. ఈ భేటీపై స్పీకర్ గానీ, సెంగోటయ్యన్‌గానీ నోరుమెదపలేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయ బడ్జెట్ దాఖలైన తర్వాత సచివాలయం వెలుపల ఈపీఎస్ మీడియాతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా విలేకరులు కొందరు అన్నాడీఎంకే శాసనసభ్యుల సమావేశానికి సెంగోటయ్యన్ గైర్హాజరవడం, స్పీకర్‌ను కలుసుకోవడంపై ప్రశ్నించారు. ఈపీఎస్ బదులిస్తూ డీఎంకేలాగా తాను పార్టీలో ఎవరినీ బానిసలుగా భావించడంలేదని, సెంగోటయ్యన్ తనను ఎందుకు కలుసుకోలేదో ఆయన్నే అడగాలని చెప్పారు. తానెప్పుడూ ఎవరినీ వ్యతిరేకించనని, పార్టీకి తాను నాయకుడిగా వ్యవహరించడం లేదని, సాధారణ కార్యకర్తగా అందరితో మెలగుతున్నానని కాస్త ఆగ్రహంగా బదులిచ్చారు. డీఎంకేలో ఉన్నట్లు తమ పార్టీలో వారసత్వ రాజకీయాలకు తావులేదని, పార్టీకి చెందిన నేతలు, మాజీ మంత్రులు ఎవరినైనా కలుసుకోవచ్చని, ఆ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు ఉండవన్నారు. తమకు డీఎంకే మాత్రమే బద్ధశత్రువు అని, ఇతరులెవరూ శత్రువులు కారని స్పష్టం చేశారు.

సెంగోటయ్యన్ వివరణ... : స్పీకర్ అప్పావును ఆయన ఛాంబర్‌లో కలుసుకోవడం వెనుక ఎలాంటి రాజకీయాలు లేవని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెంగోటయ్యన్ పేర్కొన్నారు. స్పీకర్‌తో తాను భేటీ కావడంపై పార్టీలో వదంతులు అధికం కావడంతో తాను ఈ వివరణ ఇస్తున్నానని చెప్పారు. తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను గురించి చర్చించడానికే స్పీకర్‌ను కలుసుకున్నానని తెలిపారు. ప్రత్యేకించి పర్యావరణ పరిస్థితులకు సంబంధించిన సమస్యలపై శాసనసభలో సావధాన తీర్మానం ప్రవేశ పెట్టేందుకే స్పీకర్‌ను కలుసుకున్నానని చెప్పారు. స్పీకర్‌ను శాసనసభ్యుడు కలుసుకోవడం సాధారణమైన విషయమేనని సెంగోటయ్యన్ పేర్కొన్నారు.

పొగడ్తలు వద్దు

● ఎమ్మెల్యేలకు స్టాలిన్ హితవు

టి.నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో తనను పొగడుతూ మాట్లాడకూడదని డీఎంకే ఎమ్మెల్యేలకు ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సూచించారు. శుక్రవారం రాత్రి అన్నా అరివాలయంలో డీఎంకే శాసనసభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్టాలిన్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ బడ్జెట్ సమావేశాల్లో పార్టీ సభ్యులు ఎలా ప్రవర్తించాలి, అన్నాడీఎంకే ఆరోపణలను ఎలా తిప్పికొట్టాలనే విషయాలపై సలహాలు, సూచనలు అందించారు. మంత్రులందరూ తమ శాఖకు సంబంధించిన అంశాలపై సమగ్రమైన సమాచారంతో సభకు హాజరుకావాలని చెప్పారు

జయ పాలన బీజేపీతోనే సాధ్యం

● టీటీవీ దినకరన్



మీడియాతో మాట్లాడుతున్న టీటీవీ దినకరన్

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే జయలలిత పాలన సాధ్యమని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ అభిప్రాయపడ్డారు. తిరుచ్చిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... టాస్మాక్‌లో రూ.1,000 కోట్ల అవినీతి జరిగినట్టు, చెన్నై కార్పొరేషన్‌లో టాయిలెట్ ప్రాజెక్టులో కూడా భారీ అవినీతి జరిగిందన్నారు. ఇలాంటి కుంభకోణాలు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిధ్వనించనున్నాయని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ అధికారం చేపడుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ మాత్రమే జయలలిత పాలన అందించే సత్తా ఉందన్నారు. ఎన్డీఏ కూటమిలోకి అన్నాడీఎంకే రావాలని, అందులో పళనిస్వామి ఉంటారా, ఉండరా అనే విషయం తెలియదన్నారు. అన్నాడీఎంకేలో ఓపీఎస్, శశికళ చేరినా, తాను పార్టీ ప్రారంభించినందున, కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లోగోలో 'రూ' అనేలా మార్చడం చిన్నపిల్లల ఆటగా ఉందని వ్యాఖ్యానించారు. తమిళ భాష గురించి పెరియార్ తెలిపిన మాటలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారన్నారు. పెరియార్ తమకు సూత్రప్రాయమైన నాయకుడే అయినప్పటికీ, ఆయన దేవుడు, బ్రాహ్మణ వ్యతిరేకత తదితరాలు తాము అంగీకరించమని దినకరన్ తెలిపారు.

స్పీకర్‌పై అన్నాడీఎంకే అవిశ్వాస తీర్మానం

● అసెంబ్లీలో 17న ఓటింగ్

టి.నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే అసెంబ్లీ స్పీకర్ అప్పావుపై ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానంపై ఈనెల 17న ఓటింగ్ జరగనుంది. శాసనసభలో తమ పార్టీ సభ్యులు మాట్లాడేందుకు తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని, అన్నాడీఎంకే సహా ప్రతిపక్ష సభ్యులు శాసనసభలో చేస్తున్న ఆరోపణలు, విమర్శలను సక్రమంగా ప్రత్యక్ష ప్రసారం చేయకుండా అడ్డుకుంటున్నారని స్పీకర్‌పై ఆరోపణలు చేస్తూ ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి నోటీసు సమర్పించారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న స్పీకర్‌పై ప్రవేశపెట్టే అవిశ్వాస తీర్మానంపై ఈపీఎస్, ఇతర పార్టీల సభ్యులు ప్రసంగించనున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ తదితర పాలక పక్ష సభ్యులు ప్రతిపక్షం ఆరోపణలు ఖండిస్తూ ప్రసంగించనున్నారు. సభలో ఈ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే సమయంలో స్పీకర్‌కు బదులుగా డిప్యూటీ స్పీకర్ పిచ్చాండి సభను నిర్వహిస్తారు. అదే రోజు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుంది. సభలో పాలకపక్షానికి మెజారిటీ అధికంగా ఉండటం వల్ల ఈ అవిశ్వాస తీర్మానం వీగిపోనుంది.

కరువు భత్యంతో కూడిన పింఛన్ పంపిణీ చేయాలి

● పౌష్టికాహార సిబ్బంది ధర్నా



ప్లకార్డులతో ఆందోళనకారుల నిరసన

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కరువు భత్యంతో కూడిన పింఛన్ పంపిణీ చేయాలని కోరుతూ తమిళనాడు పౌష్టికాహార, అంగన్‌వాడీ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో స్థానిక హార్బర్‌లోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో నిర్వహించిన ధర్నాలో 200మంది పైగా పౌష్టికాహార కార్మికులు పాల్గొన్నారు. వీరు డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించి నిరసన వ్యక్తంచేశారు. శుక్రవారం సాయంత్రం చేపట్టిన ఈ ధర్నా గురించి సంఘ నిర్వాహకులు ఇంద్రాణి, ముత్తులింగం సంయుక్తంగా మాట్లాడుతూ... ధరలు విపరీతంగా పెరుగుతున్న ఈ రోజుల్లో రూ.2వేల పింఛన్‌తో జీవనం సాగించడం కష్టతరమైందని, అందువల్ల కరువు భత్యంతో కూడిన పింఛన్‌గా రూ.6,750 ఇవ్వాల్సిందిగా కోరుతూ, గత 8ఏళ్లుగా కొనసాగిస్తున్న ధర్నాకు ఇప్పటివరకు పరిష్కారం జరగలేదన్నారు. పౌష్టికాహారం, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసి, పదవీవిరమణ పొందిన ఉద్యోగుల డిమాండ్లను రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా పరిశీలించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లోనే తమకు లబ్ధి చేకూర్చాలని వారు డిమాండ్ చేశారు.

పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ పెరుగుతాయని వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. రానున్న 48 గంటల్లో రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందన్నారు. ఇక ఈనెల 18 నుంచి 21వ తేది వరకు తమిళనాడు, పుదుచ్చేరిలలో ఒకటి, రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురుస్తుందని తెలిపింది. అలాగే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఉదయం వేళల్లో స్వల్పంగా మంచు కురిసే అవకాశముందని తెలిపింది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం కాస్త మేఘావృతంగా ఉంటూ పగటి ఉష్ణోగ్రతలు 33-34 డిగ్రీలు, రాత్రి ఉష్ణోగ్రతలు 24-25 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

మరుదమలై ఆలయ రాజగోపుర కలశాల తొలగింపు



కలశాల తొలగింపులో దేవాదాయ శాఖ అధికారులు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మరుదమలై సుబ్రమణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం జరగనున్న నేపథ్యంలో, రాజగోపురంలోని పాత కలశాలు తొలగించారు. ఈ ఆలయ కుంభాభిషేకం 2013లో జరిగింది. 12 ఏళ్ల అనంతరం ఏప్రిల్ 4వ తేది కుంభాభిషేకం నిర్వహించనున్నారు. కుంభాభిషేక పనుల కోసం గత జనవరి 20వ తేది బాలాలయం పూజలతో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, కుంభాభిషేకం సందర్భంగా 84 అడుగుల ఎత్తున్న రాజగోపురంపై ఉన్న పాత కలశాలను హిందూ దేవాదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. వీటి స్థానంలో కొత్త కలశాలు ఏర్పాటుచేయనున్నారు. ఈ విషయమై ఆలయ జాయింట్ కమిషనర్ సెంథిల్‌కుమార్ మాట్లాడుతూ.. రాజగోపురంపై ఉన్న పాత కలశాలు తొలగించి కొత్త కలశాలు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ఇండియన్ ఆర్మీలో ఉద్యోగావకాశాలు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీలో పలు ఉద్యోగాలకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీరులు (మహిళలు, పురుషులు) పథకంలో భాగంగా జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ పోస్టులకు 10వ తరగతి, ట్రేడ్స్‌మెన్ పోస్టుకు 8వ తరగతి ఉత్తీర్ణులై, వివాహం కాని వారు అర్హులు. అలాగే, టెక్నికల్ నర్సింగ్ అసిస్టెంట్, సిపాయ్ ఫార్మా, జనరల్ డ్యూటీ (ఉమెన్ మిలటరీ పోలీసు) ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఉద్యోగాల భర్తీకి తమిళం సహా 13 భాషల్లో జూన్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఆసక్తి కలిగిన వారు అనే వెబ్‌సైట్‌లో ఏప్రిల్ 10వ తేదిలోపు www.joinindianarmy.nic.in లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు అదే వెబ్‌సైట్, స్థానిక సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని రిక్రూట్‌మెంట్ కార్యాలయం నెం. 044-25674924లో సంప్రదించవచ్చు.

ప్రేమ పెళ్లి చేసుకున్న జంటపై దాడి

● తాళిని తెంపిన తల్లిపై ఆగ్రహంతో కుమార్తె ఆత్మాహుతి

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పెళ్లి చేసుకుని పోలీసు భద్రత కోరేందుకు వెళుతున్న జంటపై వధువు తరపు కుటుంబీకులు దాడి జరిపారు. ఆ సందర్భంగా వధువు మెడలోని తాళిని ఆమె తల్లి తెంచింది. ఆ సంఘటనతో దిగ్భ్రాంతి చెందిన వధువు ఇంటికెళ్లి ఒంటికి నిప్పంటించుకుని ఆత్మాహుతికి పాల్పడింది. తిరువణ్ణామలై జిల్లా ఆరణిలోని మహిళా పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో వధువును ఆమె కుటుంబీకులు చితకబాదుతుండడం, కుమార్తె తాళిని తెంపుతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి శ్రీలంక తమిళుల పునరావస కేంద్రంలో బస చేస్తున్న గణేష్, ప్రియ దంపతుల కుమార్తె పూజ(21) ఆరణి సమీపంలోని నర్సింగ్ కాలేజీలో చదువుతూ కస్తంబాడి వద్ద నున్న శ్రీలంక శరణార్థుల శిబిరంలోని బంధువుల ఇంటి బస చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆ శిబిరంలోనే నివసిస్తున్న చరణ్‌రాజ్ (19)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇటీవల కుటుంబీకులకు తెలియకుండా ఓ గుడిలో పెళ్లి చేసుకున్నారు. ఈ లోగా ఇంటి నుండి పారిపోయిన సంఘటనపై పూజ తల్లిదండ్రులు గుమ్మిడిపూండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రేమ జంట భద్రత కోసం ఆరణి మహిళా పోలీసుస్టేషన్‌లో ఆశ్రయం పొందాలనుకున్నారు. తల్లిదండ్రులకు ఈ సమాచారం తెలిసింది. ఆ నేపథ్యంలో ప్రేమ జంట కారులో ఆరణి మహిళా పోలీసుస్టేషన్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో పూజ కుటుంబీకులు అడ్డుకున్నారు. ఆ తర్వాత చరణ్‌రాజ్‌పై, పూజాపై దాడికి పాల్పడ్డారు. అదే సమయంలో పూజ మెడలోని మంగళసూత్రాన్ని ఆమె తల్లి ప్రియ తెంచిపడేసింది. ఈ ఘటన ఆరణి మహిళా పోలీసుస్టేషన్ పోలీసులు చూస్తుండగానే జరిగింది. పోలీసులు ప్రేమజంటపై జరుగుతున్న దాడిని అడ్డుకోకుండా ప్రేక్షక పాత్రను పోషించారు. ఆ తర్వాత పూజను కస్తంబాడి వద్ద నున్న శ్రీలంక శరణార్థుల శిబిరంలోని బంధువుల ఇంటికి తీసుకెళ్లారు. మరుసటి రోజు పూజా ఒంటికి నిప్పంటించుకుంది. 90 శాతం కాలిన గాయాలతో కీల్పాక్ వైద్యకళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. గుమ్మిడిపూండి పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న గవర్నర్ ఆర్‌ఎన్ రవి, సీఎం స్టాలిన్, రాజకీయ పార్టీల నేతలు

● ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు

మాజీ మంత్రి షణ్ముగంపై కేసుల కొట్టివేత

వాషర్‌మెన్‌పేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే మాజీ మంత్రి సీవీ షణ్ముగానికి వ్యతిరేకంగా దాఖలైన కేసులను మద్రాసు హైకోర్టు కొట్టివేసింది. పలు ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభల్లో ముఖ్యమంత్రి స్టాలిన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీవీ షణ్ముగంపై కేసులు నమోదయ్యాయి. వాటిని కొట్టివేయాలని షణ్ముగం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. దాన్ని న్యాయమూర్తి ఇళంద్రియన్ విచారించగా షణ్ముగం తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. ప్రతి పక్ష పార్టీ హోదాలో అధికార పార్టీని విమర్శించే హక్కు ఉందని, రాజకీయ కక్షల కారణంగానే కేసులు నమోదు చేశారని వాదించారు. అయితే పిటిషన్‌దారుడి తరపు వ్యాఖ్యలను పోలీసు శాఖ తరఫున ఖండించారు. న్యాయస్థానాలు పలుమార్లు హెచ్చరించినా, విమర్శించారని వాదించారు. ఇరుతరపు వాదనల అనంతరం న్యాయమూర్తి... మాజీ న్యాయశాఖ మంత్రి హోదాలో ఉన్న షణ్ముగం జాగ్రత్తగా మాట్లాడాలని, ప్రతిపక్ష పార్టీ హోదాలో విమర్శలు చేయవచ్చని, కానీ హేళన చేయరాదని సూచించారు. బహిరంగ సభల్లో ప్రసంగించే సమయంలో ఆచితూచి మాట్లాడాలని, భవిష్యత్తులో ఆయన ఈ విధంగా మాట్లాడకుండా ఉండేలా నిబంధనలు విధిస్తున్నట్లు పేర్కొన్న న్యాయమూర్తి... షణ్ముగంపై ఉన్న కేసులు కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బాలికపై లైంగిక వేధింపులు

యువకుడి అరెస్ట్

వాషర్‌మెన్‌పేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మూడవ తరగతి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తంజావూరు సమీపంలోని గ్రామానికి చెందిన బాలిక ఘటన జరిగిన రోజున పాఠశాలకు వెళ్లేందుకు వేచి ఉండగా, ఆ సమయంలో బైక్‌పై వచ్చిన యువకుడు, బాలికను పాఠశాల వద్దకు తీసుకెళ్తానని చెప్పి ఎక్కించుకున్నాడు. పాఠశాలకు వెళ్లకుండా జనసంచారం లేని ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై వారు సమీప మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు పోక్సో చట్టంపై కేసు నమోదు చేసి యువకుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

9వ అంతస్తు నుంచి దూకి టీచర్ ఆత్మహత్య

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకోవడం ఇష్టం లేని టీచర్, అపార్ట్‌మెంట్ మిద్దె నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన స్థానిక మందవెల్లిలో జరిగింది. మందవెల్లి తిరువేంగడం వీధిలోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న మాళవిక(38) అభిరామపురంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో టీచర్. మాళవికకు ఇంకా వివాహం కాకపోవడంతో తల్లిదండ్రులకు వరుడు కోసం గాలిస్తున్నారు. తనకు వివాహం ఇష్టం లేదని మాళవిక తెలిపినా, ఆమె మాటలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం వాకింగ్ వెళ్లి ఇంటికి తిరిగొచ్చిన మాళవిక, నేరుగా అపార్ట్‌మెంట్‌లోని 9వ అంతస్తు పైకెక్కి అక్కడి నుంచి కిందకు దూకింది. తీవ్రగాయాలతో ఉన్న ఆమెను చుట్టుపక్కల వారు వెంటనే రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మైలాపూర్ పోలీసులు, వివాహం ఇష్టం లేక ఆమె ఆత్మహత్యకు పాల్పడిందా? మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో విచారిస్తున్నారు.

వేలూరులో తమిళగ వాల్వురిమై కట్చి సమావేశం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సయ్యద్ అసేన్

వేలూరు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేలూరులో శనివారం ఉదయం జరిగిన తమిళగ వాల్వురిమై కట్చి జిల్లా కార్యకర్తల సమావేశంలో పార్టీజిల్లా సెక్రటరీ అనై సయ్యద్ అసేన్ ఆధ్వర్యంలో సుమారు 200మంది పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సయ్యద్ అసేన్ మాట్లాడుతూ, కొత్తగా పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. పార్టీలో కష్టపడిన ఏ ఒక్కరిని పార్టీ మర్చిపోదని, పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు.

తేనాంపేటలో రౌడీషీటర్ దారుణహత్య

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తేనాంపేటలో పాతకక్షల నేపథ్యంలో శుక్రవారం రాత్రి పేరుమోసిన రౌడీషీటర్‌ను దారుణంగా హతమార్చారు. పట్టుకునేందుకు యత్నించిన ఎస్‌ఐను కత్తిచూపి బెదిరించి పరారైన హంతకుల ముఠా కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. తేనాంపేటకు చెందిన రాజా(40) రౌడీ షీటర్. అతనిపై నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో 20కిపైగా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి తేనాంపేట భారతీయార్ రోడ్డులో నడిచివెళ్తున్న రాజాను ద్విచక్రవాహనంపై వెళ్లిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో దాడి చేశారు. తలకు తీవ్రగాయాలవడంతో రాజా ఆ ముఠా నుంచి తప్పించుకునేందుకు యత్నించడం ఆ ప్రాంతంలో భద్రతా విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ హంతకుల ముఠాను పట్టుకునేందుకు యత్నించారు. కత్తితో బెదిరించి వారు పారిపోయారు. ఈ నేపథ్యంలో రాజా రక్తపుమడుగులో అక్కడిక్కడే మృతిచెందాడు. సమాచారమందుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అంబులెన్సులో రాయపేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం హత్య జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరా ఫుటేజీని పోలీసులు పరిశీలించారు. దీని ఆధారంగా పరారైన నిందితులు తేనాంపేటకు చెందిన రౌడీలు మాండుమణి, రాజేంద్రన్, విఘ్నేష్‌గా అనుమానిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికార డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం సమీపంలో జనసంచారం అధికంగా ఉండే తేనాంపేటలో రౌడీని హతమార్చిన సంఘటన స్థానికులను భయాందోళనలకు గురి చేసింది.

లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి



రవి మృతదేహం

తడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలబడి ఉండగా లారీ ఢీకొనడంతో తమిళనాడు వాసి మృతి చెందాడు. తమిళనాడు రాష్ట్రంలోని ఆరంబాకం గ్రామానికి చెందిన కె.రవి(57) లారీ క్లీనర్. శుక్రవారం అర్ధరాత్రి తడ మండలంలోని రామాపురానికి వచ్చాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలబడి ఉండగా చెన్నై వైపు వెళ్లే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రవి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఎలావూరు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంతోషి - సందీప్‌కుమార్ వివాహ వేడుకలు

● గవర్నర్, సీఎం సహా ప్రముఖుల హాజరు

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే గాయత్రిదేవి - వాసుదేవన్ కుమార్తె సంతోషికి సమీర గ్రూప్ చైర్మన్ మురుగేశన్ - సుమిత కుమారుడు సందీప్‌కుమార్ వివాహం ఇటీవల జరిగింది. వేడుకలకు రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుంతగై, తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, నామ్ తమిళర్ పార్టీ ఆర్గనైజర్ సీమాన్ సహా పలు పార్టీల నేతలు, ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌లో 'సిమట్స్'

చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సవీత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ టెక్నికల్ సైన్సెస్ (సిమట్స్) క్యూఎస్ వరల్డ్ యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌లో సబ్జెక్ట్ (డెంటిస్ట్రీ) వారీగా ప్రపంచవ్యాప్తంగా 26వ ర్యాంకు సాధించడం ద్వారా చరిత్రాత్మక మైలురాయిని సాధించింది. ఈ అద్భుతమైన విజయం సిమట్స్‌ని భారతదేశంలోని నాలుగు సంస్థల్లో ఒకటిగా నిలిపినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఏ సబ్జెక్టులోనైనా గ్లోబల్ టాప్ 30లో స్థానం నిలిచింది. ఈ సందర్భంగా సిమట్స్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ మాట్లాడుతూ.. ప్రపంచ వేదికపై దేశంలోని అగ్రశ్రేణి సంస్థల్లో ఒకటిగా సిమట్స్ నిలవడం గౌరవమని, ప్రపంచంలోని టాప్ 30లో భారతదేశం నుంచి ఏకైక దంత సంస్థ కావడం విద్యా, క్లినికల్ ఎక్సలెన్స్ కోసం తమ నిరంతర కృషిని తెలియజేస్తుందని పేర్కొన్నారు.

127వ పుష్ప ప్రదర్శనకు ఊటీ బొటానికల్ గార్డెన్ ముస్తాబు



మొక్కలు నాటుతున్న కలెక్టర్ లక్ష్మి భవ్య తదితరులు

పెరంబూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో 127వ పుష్ప ప్రదర్శనకు 7.5 లక్షల పూల మొక్కలు నాటే పనులు ప్రారంభమయ్యాయి. నీలగిరి జిల్లా ఊటీ ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో మే నెలలో నిర్వహించనున్న పుష్ప ప్రదర్శనకు, వివిధ దేశాల నుంచి పలురకాల మొక్కలు దిగుమతి చేసుకున్నారు. మేరిగోల్డ్, ఫ్రెంచ్ మేరీ గోల్డ్ సహా పలురకాల పూల మొక్కలు నాటే పనులను జిల్లా కలెక్టర్ లక్ష్మి భవ్య శనివారం ప్రారంభించారు. ఈ ఏడాది ప్రదర్శన పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా జెరేనియం, సైక్లామెన్, బాల్సామ్, ఓరియంటల్ లిల్లీస్, ఆసియాటిక్ లిల్లీస్, బిగోనియాస్, క్యాండీటఫ్ట్, పెటునియాస్, ఫ్లాక్స్, జినియాస్, డెల్ఫినియం, సాల్వియా, ఆస్టర్, జెర్బెరా సహా 275 రకాల విత్తనాలు, మొక్కలను జపాన్, అమెరికా, జర్మనీ, నెదర్లాండ్స్‌తో పాటు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సేకరించారు. ప్రస్తుతం నాటుతున్న పూలమొక్కలపై మంచు పడకుండా చర్యలు చేపట్టామని, ఫ్లవర్ షోరూం, గ్లాస్ హౌస్‌లలో 40 వేల రంగురంగుల పూల మొక్కలు నాటే పనులు కూడా ప్రారంభించినట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు.

నాణ్యమైన విద్యకు ఆస్ట్రేలియా గమ్యస్థానం

- ఆస్ట్రేడ్ దక్షిణాసియా వాణిజ్య, పెట్టుబడిదారుల కమిషనర్ వీకే సింగ్



చెన్నై, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య, చక్కటి భోజన అనుభవాలకు ఆస్ట్రేలియా ప్రముఖ గమ్యస్థానమని ఆస్ట్రేడ్‌లోని దక్షిణాసియా వాణిజ్య, పెట్టుబడుల విభాగ కమిషనర్ వీకే సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో జరిగిన ఆస్ట్రేలియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ (ఆస్ట్రేడ్) 'ఫెస్టివల్ ఆఫ్ ఆస్ట్రేలియా' ప్రారంభోత్సవంలో వీకే సింగ్ మాట్లాడుతూ.. విద్య, వంటకాలలో ఆస్ట్రేలియా గొప్పతనాన్ని ప్రదర్శించే ఈ ఉత్సవం రెండవ దశను చెన్నైలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా భారతీయ విద్యార్థులు, కుటుంబాలు, ఆహార ప్రియులకు అవగాహన పెంచడం, కొత్త అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 16న పుణెలో, 20న అహ్మదాబాద్‌లో, 22న ఢిల్లీలో జరగనున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అల్లీషిప్ క్లబ్బుల ప్రారంభం



విద్యార్థులతో అవతార్ హ్యూమన్ కేపిటల్ ట్రస్ట్ నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో లాభాపేక్షలేని ప్రముఖ వర్క్‌ప్లేస్ కల్చర్ కన్సల్టింగ్ సంస్థ అవతార్ హ్యూమన్ కేపిటల్ ట్రస్ట్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్లీషిప్ క్లబ్‌లను ప్రారంభించింది. తరమణిలోని టైడెల్ పార్క్ ప్రాంగణంలో శనివారం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు మేల్ అల్లీషిప్ సినర్జీ సదస్సు నిర్వహించింది. కార్పొరేట్ నిపుణులు, విద్యార్థులు, పురుషుల మైత్రిని సాధించాలన్న ఉద్దేశంతో నిర్వహించిన ఈ సదస్సులో నిర్వహించి 'హార్ట్ టూ హార్ట్' పోస్టర్ తయారీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా మిస్టర్ కూపర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ మోహన్‌రాం విచ్చేసి, నిర్వాహకులు, విద్యార్థులతో లింగ సమానత్వాన్ని పెంపొందించడానికి తమ నిబద్ధతను బలోపేతం చేయడానికి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రాష్ట్రంలో ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో అల్లీషిప్ క్లబ్‌లను ప్రారంభించారు.

ఘనంగా బ్లూ క్రాస్ 60వ వార్షికోత్సవం



సావనీరును ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బ్లూక్రాస్ ఆఫ్ ఇండియా 60వ వార్షికోత్సవం మద్రాస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. స్థానిక మైలాపూర్‌లోని దక్షిణామూర్తి ఆడిటోరియంలో మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ జడ్జి పీఎన్ ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కేంద్రమాజీ మంత్రి మేనకాగాంధీ విచ్చేసి బ్లూక్రాస్ 60వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేకంగా ముద్రించిన 'మెమరీస్ అండ్ మైల్ స్టోన్స్' అనే సావనీరును ఆవిష్కరించారు. తొలిప్రతిని తమిళనాడు ప్రభుత్వ మాజీ అడ్వొకేట్ జనరల్ ఏ.ఎల్.సోమయాజులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పెంపుడు జంతువుల సంరక్షణ సంస్థలకు చెందిన డాక్టర్ చిన్నికృష్ణ, ప్రముఖ రచయిత శ్రీరామ్‌లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



SUNDAY SPECIAL

మసాలా ఘుమఘుములు...

- అంగప్పనాయకన్ వీధిలో రంజాన్ మాస ప్రత్యేకం

నోరూరించే వంటకాలు



పవిత్ర రంజాన్‌మాసం వచ్చిందంటే చాలు.. ఆ వీధుల్లో మసాలా వాసన గుప్పుమంటుంది. ఇక నోరూరించే వంటల గురించి చెప్పాల్సిన పనే లేదు. ఆంధ్రా బజ్జీ నుంచి కశ్మీర్ షర్బత్ దాకా అన్ని రకాలు అందుబాటులో ఉంటాయి.. ఇక చికెన్ ఫ్రై నుంచి మటన్ కీమా సహా వివిధ మాంసాహార పదార్థాలకు కొదవే లేదు.. ఆ వీధిలోకి అడుగు పెడితే చాలు.. ఏది ఎంచుకోవాలో, ఏది తుంచుకోవాలో అర్థంకానన్ని పదార్థాలుంటాయి మరి.. అది ఎక్కడ ఉందంటారా?.. హార్బర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మన్నడి ప్రాంతమే అది.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి



రంజాన్ మాసంలో ఉపవాసదీక్ష రోజుల్లో భోజనాన్ని రుచికరంగా, ఆరోగ్యదాయకమైన పదార్థాలను తినడానికి ముస్లింలు ఇష్టపడుతుంటారు. కేవలం ఉపవాసాలు, నమాజులు మాత్రమే కాదు... నోరూరించే వంటకాలు కూడా ఈ మాసంలోనే ఘుమఘుమలాడుతుంటాయి. రుచికరమైన రంజాన్ వంటకాలను వేడివేడిగా ఆస్వాదించాలంటే అంగప్పనాయకన్ వీధికి వెళ్లాల్సిందే. గత ఐదేళ్లవరకు ఈ వీధిలో మాత్రమే ఉన్న 'రంజాన్ ప్రత్యేక బజార్' ప్రస్తుతం చుట్టుపక్కల ఉన్న వీధుల్లో కూడా విస్తరించింది.

సౌదీ ఐటెం... ప్రత్యేకం

ముస్లింలు అధికసంఖ్యలో నివసిస్తున్న ప్రాంతం మన్నడి. ఇక్కడ దాదాపు పది వీధులు రంజాన్ వంటకాలను రుచిచూసేందుకు పెద్దసంఖ్యలో తరలివస్తున్న కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. సౌదీ అరేబియాలో ప్రసిద్ధిచెందిన వంటకాలన్నీ ఈ మాసంలో అందుబాటులో ఉంటాయి. చికెన్ టిక్కా, మటన్ కోఫ్తా, ఎవర్‌గ్రీన్ కర్రీ, సజ్‌రోటీ, గార్లిక్ చికెన్, కోడి వేపుడు, ఎగ్ మసాలా, పీస్ బిర్యానీ, వెజిటబుల్ సలాడ్, కీమా దోశలు, చికెన్, మటన్ కబాబ్ తదితర నోరూరించే రుచికరమైన వంటకాలు సరసమైన ధరలకు విక్రయిస్తుంటారు. రంజాన్ మాసంలో సాయంత్రం 5 గంటలకు మొదలయ్యే రద్దీ అర్ధరాత్రి 12.30గంటల వరకు కొనసాగుతుంది. మన్నడిలో ఉన్న అంగప్పనాయగన్‌వీధి, మోర్ స్ట్రీట్, అంగిచెట్టి వీధి, తంబుచెట్టివీధి, ముత్యాలవీధి, నార్త్ బీచ్ రెండో వీధి రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలతో పాటు మాంసాహార ప్రియులతో కిటకిటలాడుతుంటాయి.





పదార్థాలు కొనుగోలు చేస్తున్న మహిళలు



రోజ్ మిల్క్, షర్బత్



ఆహారపదార్థాల కోసం వచ్చిన వారితో కిటకిటలాడుతున్న అంగప్పనాయకన్ వీధి

వేడివేడి వడలు, సమోసాలు

వెరైటీ వంటలు... : వెజ్, నాన్‌వెజ్ సమోసాలు, వడలు, వెరైటీ బోండాలు, బజ్జీలు, మటన్, చికెన్ టిక్కాలు, గ్రిల్డ్ చికెన్, చికెన్ లాలీపాప్, కట్‌లెట్లు సహా రకరకాల మిల్క్‌షేక్‌లు, లస్సీ, బాదంఖీర్, రోస్‌మిల్క్, షర్బత్, పండ్లరసాలకు ఫిదా అయిపోతారు. ఈ ఏడాది విశేషమేమిటంటే రంజాన్ బజార్ గురించిన సమాచారం తెలుసుకున్న ఐటీ, ఇంజనీరింగ్, మెడికల్, పాలిటెక్నిక్ విద్యార్థులు మన్నడికి గుంపులు గుంపులుగా తరలివచ్చి వేడివేడి వంటకాలను తృప్తిగా ఆరగిస్తున్నారు. వీలైతే ఒక్కసారి రుచి చూసి రండి మరి!

దర్శన్ హీరోగా 'సరెండర్'



'సరెండర్' ఫస్ట్‌లుక్

దర్శన్ హీరోగా రూపొందిన చిత్రం 'సరెండర్'. ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. బిగ్ బాస్ తమిళ్ మూడో సీజన్‌తో మంచి గుర్తింపును సొంతం చేసుకున్న దర్శన్... ఆ తర్వాత 'గూగుల్ కుట్టప్ప', 'నాడు' వంటి చిత్రాల్లో హీరోగా నటించారు. ప్రస్తుతం 'సరెండర్' మూవీలో పోలీస్ అధికారి పాత్రలో నటించగా, ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి తన ఎక్స్ వేదికగా విడుదల చేశారు. క్రైం యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి గౌతమన్ గణపతి దర్శకుడు. ప్రముఖ దర్శకుడు అరివళగన్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయన ఈ చిత్రం ద్వారా దర్శకత్వ బాధ్యతలను తొలిసారి చేపట్టారు. నిర్మాత విక్టర్ కుమార్. ఇందులో దర్శన్‌తో పాటు లాల్, సుజిత్ శంకర్, మునీష్‌కాంత్, మన్సూర్ అలీఖాన్, పతినేకుమార్ తదితరులు నటించారు. మెయ్యేంద్రన్ ఛాయాగ్రహణం సమకూర్చగా, వికాస్ బదీసా సంగీత స్వరాలు సమకూర్చారు. చిత్రీకరణ పనులు పూర్తిచేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. త్వరలోనే చిత్ర ఆడియో, ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు వెల్లడించారు.

గౌతం మేనన్ దర్శకత్వంలో కార్తి?



గౌతం మేనన్ - కార్తి

తమిళ చిత్రజ్యోతి

ప్రముఖ దర్శకుడు, నటుడు గౌతం వాసుదేవ్ మేనన్ దర్శకత్వంలో హీరో కార్తి ఓ చిత్రంలో నటించనున్నట్టు కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రముఖ రచయిత జయమోహన్‌తో కలిసి సిద్ధం చేసిన కథకు హీరో కార్తి సరిపోతారని భావించిన గౌతం మేనన్... ఇందుకోసం ఆయనతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం కార్తి... మిత్రన్ ఆర్.జవహర్ దర్శకత్వంలో 'సర్దార్-2'లో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పనులు పూర్తి చేసుకుని డబ్బింగ్ పనులను ప్రారంభించారు. ఇందులో తన పాత్రకు సంబంధించిన డబ్బింగ్‌ను కార్తి పూర్తి చేశారు. ఆ తర్వాత 'టాణా క్కారన్' ఫేం తమిళ్ దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించేందుకు తన క్యాల్షీట్లను కేటాయించారు. అనంతరం లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'ఖైదీ-2', మారి సెల్వరాజ్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ చిత్రాలన్నీ పూర్తయిన తర్వాత గౌతం మేనన్ చిత్రంలో నటించేందుకు కార్తి మొగ్గు చూపొచ్చని కోలీవుడ్ వర్గాల సమాచారం.

పదేళ్ల తర్వాత మీరా జాస్మిన్ రీఎంట్రీ



చిత్రపరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన మలయాళ హీరోయిన్లలో మీరా జాస్మిన్ ఒకరు. ఈమె వివాహం చేసుకున్న తర్వాత వెండితెరకు దూరమయ్యారు. అలా పదేళ్లు గడిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఇటీవల తన సోషల్ మీడియా ఖాతాల్లో ఆమె కొన్ని గ్లామర్ ఫొటోలను షేర్ చేసి ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేశారు. ఈ నేపథ్యంలో ఆర్.మాధవన్, సిద్ధార్థ్, నయనతారలతో కలిసి మీరా జాస్మిన్ 'ది టెస్ట్'లో నటించారు. ఇది ఏప్రిల్ 4 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. వైనాట్ స్టూడియోస్ అధినేత ఎస్.శశికాంత్ దర్శకత్వం వహించారు. 2014లో వచ్చిన 'విజ్ఞాని' అనే చిత్రంలో చివరిసారిగా నటించిన మీరా జాస్మిన్... ఇపుడు 'ది టెస్ట్' చిత్రం ద్వారా తమిళ వెండితెరపై కనిపించనున్నారు.

ఇళయరాజా బయోపిక్ సంగతేంటి?



ధనుష్, ఇళయరాజా

'ఇసైజ్ఞాని' ఇళయరాజా జీవిత చరిత్ర ఆధారంగా 'ఇళయరాజా' బయోపిక్ పేరుతో ఓ చిత్రం తెరకెక్కించనున్నట్టు గతంలో ప్రకటించారు. హీరో ధనుష్ ప్రధాన పాత్రను పోషించే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను అగ్రనటుడు కమలహాసన్, ఇళయరాజా, ధనుష్ కలిసి విడుదల చేశారు. అరుణ్ మాదేశ్వరన్ దర్శకుడు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టు కోసం దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ పలుమార్లు ఇళయరాజాను కలిసి పలు విషయాలను సేకరించారు. అలాగే, సినిమా షూటింగ్ కోసం ఓ భారీ సెట్‌ను కూడా నిర్మించారు. దీన్ని చూసిన ఇళయరాజా కొన్ని సూచనలు సలహాలు చేశారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్టుపై ఎలాంటి అప్‌డేట్స్ లేవు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎయిర్‌పోర్టులో హీరో ధనుష్‌ను కలిసి ఓ రాజకీయ పార్టీకి చెందిన ఎంపీ ఒకరు.. 'ఇళయరాజా' బయోపిక్ గురించి ప్రస్తావించగా, ఇంకా ఆ ప్రాజెక్టు కన్ఫార్మ్ కాలేదని సమాధానమిచ్చినట్టు సమాచారం. అయితే, కోలీవుడ్ వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాజెక్టును విరమించుకున్నట్టు తెలుస్తోంది.

అరక్కోణంలో అసోం రైఫిల్స్ బృందాలు

- ఘనస్వాగతం పలికిన జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

తిరుత్తణి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో జరుగుతున్న ఆలిండియా గన్ షూటింగ్ పోటీల్లో పాల్గొనేందుకు తిరువళ్లూరు జిల్లా తిరుత్తణికి చేరుకున్న బిహార్ రాష్ట్ర పోలీసులు, అసోం రాష్ట్ర రైఫిల్స్ బృందాలకు అరక్కోణం గవర్నమెంట్ రైల్వేపోలీస్ (జీఆర్పీ)అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్రంలో వివిధ విభాగాల్లో ఆలిండియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు చెంగల్పట్టు జిల్లాలోని అళపాక్కంలో నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనేందుకు బిహార్ రాష్ట్రం నుండి 21మంది పోలీసులు, అసోం నుంచి 29మంది స్పెషల్ రైఫిల్స్ అధికారులు అరక్కోణం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. కాగా, జీఆర్పీ పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్)అధికారులు వారిని పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వారిని చెన్నైకి పంపించారు.



అసోం రైఫిల్స్ అధికారులకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న అరక్కోణం జీఆర్పీ పోలీసులు



శేషాచలం స్నేక్స్





కామన్ ట్రింకెట్: నగరవనంలో కనిపించిన విషరహిత సర్పం

కార్తీక్ కెమెరాకు చిక్కిన అరుదైన పాములు

బర్డ్‌మెన్ కార్తీక్

అడవుల్లో పిట్టలను, పుట్టలను ఫొటోలు తీయడం 'బర్డ్‌మన్' కార్తీక్‌కు లెన్స్‌తో పెట్టిన విద్య. కానీ పుట్టలో, చెట్టులో దాక్కున్న పాములను కూడా తన కెమెరాతో బంధించి బర్డ్‌మెన్ కాస్త స్నేక్‌మన్ అయ్యాడు. శేషాచలంలో దాక్కున్న సరీసృపాల వెంట పడ్డాడు. రక్తపింజరి, ఎగిరే పాము, ఇండియన్ కోబ్రా, ఇండియన్ రాక్ పైథాన్, ఇండియన్ స్పెక్టాకిల్ కోబ్రా, రంపపు సాకెడ్ వైపర్, వెదురు పిట్ వైపర్, బార్డ్ వోల్ఫ్ స్నేక్, కామన్ ట్రింకెట్, వైన్ స్నేక్, బ్రౌన్‌మార్ఫ్, రంపపు స్కేల్డ్ వైపర్, బ్యాండెడ్ క్రైట్ ...ఇలా అనేక రకాల అరుదైన పాములను వెతికి, వెతికి ఫొటోలు తీసి పర్యావరణ ప్రపంచానికి పరిచయం చేశాడు. పాములు సహజంగా చిటారు కొమ్మలు, పగిలిన రాళ్ల సందులు, జలాశయాలు, బొరియలు.. వంటి చోట్ల ఆవాసాలను ఏర్పాటుచేసుకుంటాయి. కొన్ని జాతులు పగటి పూట మాత్రమే బయట తిరుగుతాయి. మరి కొన్ని రాత్రి పూట మాత్రమే సంచరిస్తాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మన దేశంలోని పాముల జాతులు చాలావరకు విషపూరితం కానివే. మానవులకు ఎటువంటి హానీ కలిగించవు. విషపూరిత జాతులు కూడా ఆత్మరక్షణ కోసమే కాటువేస్తాయి. పర్యావరణ వ్యవస్థలో వీటి పాత్ర కీలకమైంది. పామువల్ల మనిషికన్నా.. మనిషి వల్లే పాముకి ప్రమాదం ఎక్కువ.



సాస్కాల్డ్ వైపర్: (చిన్న పింజరి)- కరకంబాడి అటవీ ప్రాంతంలోని విషపూరిత స్పరం



ఇండియన్ స్పెక్టాకల్ కోబ్రా (నాగుపాము): తిరుపతి జంగిల్ బుక్‌లో కనిపించిన విషపూరిత సర్పం

నేటి నుంచి తిరుపతి-హుబ్లీ, కాట్పాడి ప్యాసింజర్ల రాకపోకలు

తిరుపతి(సెంట్రల్), మార్చి 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి హుబ్లీ, కాట్పాడి మధ్య రాకపోకలు నిర్వహిస్తున్న ప్యాసింజర్లను ఆదివారం నుంచి పునరుద్ధరించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి-హుబ్లీ మధ్య (57401-57402) ప్యాసింజర్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతి నుంచి హుబ్లీ ప్యాసింజరు ఆదివారం ఉదయం 6.05 గంటలకు బయలుదేరి వెళుతుందని చెప్పారు. తిరుపతి-కాట్పాడి మధ్య (67209-67210) మెము రైళ్లరాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిలో ఈ మెము ప్యాసింజర్ రైలు ఆదివారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ప్రయాణికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీసిటీ సెక్యూరిటీ మేనేజర్‌పై హత్యాయత్నం

● ఐదుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరుపై హత్యాయత్నానికి పాల్పడ్డ ఐదుగురిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. శ్రీసిటీ పరిధిలోని తొండూరు సొసైటీ కాలనీకి చెందిన మునస్వామి రెడ్డి నుంచి సర్వే నెంబరు 18/2లో ఉన్న సుమారు 3.90ఎకరాల మాగాని భూమిని శ్రీసిటీ వారు కొనుగోలు చేశారు. ఆ భూములకు కంచె ఏర్పాటు చేసే పనులను శుక్రవారం మొదలు పెట్టారు. పనులు జరుగుతున్న సమయంలో సొసైటీ కాలనీకి చెందిన పిళ్లారి రఘుపతి, అతని భార్య లక్ష్మి, బావమరిది తనికులం శీను, అతని భార్య విశాలాక్షి, కుమారుడు దేవేంద్ర ఆ భూములు తమవేనని పనులను అడ్డుకోవాలని శ్రీసిటిలోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించారు. శ్రీసిటీ సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఆ భూములను తాము అమ్మలేదని గొడవకు దిగారు. నిబంధనల ప్రకారం 2007లో ఈ భూములను శ్రీసిటీ కొనుగోలు చేసిందని ఇందుకు సంబంధించిన రికార్డులు చూపినా వారు వినిపించుకోలేదు. అక్కడ విధుల్లో ఉన్న శ్రీసిటీ మహిళా భద్రతా సిబ్బందిపై దాడులకు యత్నించారు. ఈ క్రమంలో శ్రీసిటీ డిప్యూటీ సెక్యూరిటీ మేనేజరు కోటేశ్వరరావుపై పెట్రోల్ పోసి తగులపెట్టడానికి యత్నించారు. శ్రీసిటీ ఎస్ఐ హరిప్రసాద్ హత్యాయత్నం కేసు నమోదు చేసి, రఘుపతి, శీను, దేవేంద్రను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు మాట్లాడుతూ శ్రీసిటీలో ప్రశాంతతే ముఖ్యమని, భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

నేటి నుంచి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు పరీక్షలు

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫారెస్టు సర్వీస్(స్క్రీనింగ్ టెస్టు), ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పోస్టులకు ఆదివారం నుంచి రెండు రోజులపాటు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి డీఆర్వో దేవేంద్రరెడ్డి తెలిపారు. పరీక్షల నిర్వహణపై ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉదయం, సాయంత్రం రెండు సెషన్లుగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలను తిరుపతి జూపార్కు రోడ్డులోని అయాన్ డిజిటల్ జోన్, పుత్తూరులోని వెంకట పెరుమాల్ కళాశాల, కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 1,634 మంది హాజరుకానున్నారని, దీనికి తగినట్లు కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

శ్రీవారి సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.2.88 కోట్లు, శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,987 తలనీలాలు సమర్పించినవారు: 26,880.

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం




శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు







శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



మంగళసూత్రాలు చూపుతున్న వేద పండితులు



చంద్రబాబు దంపతులకు హారతి ఇస్తున్న వేద పండితుడు



కల్యాణం తిలకిస్తున్న కేంద్రమంత్రి పెమ్మసాని, మంత్రి ఆనం, బీఆర్ నాయుడు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు



కల్యాణం తిలకిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, మంత్రి నారాయణ

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యేలు పుల్లారావు, ఆనందబాబు, రామాంజనేయులు తదితరులు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు



కల్యాణాన్ని తిలకిస్తున్న పీఠాధిపతులు